

చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి.



డీల్ కుదిరితే ఓకే

ఐసీడీఎస్‌లో ఒకే సామాజిక వర్గం వారికి కీలక అధికారి ప్రాధాన్యతనిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం

38.8°/23.2°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది.

పశు సంపదలో టాప్

- ఉమ్మడి అనంత జిల్లాలో భారీగా జీవాలు
- మేకలు, గొర్రెల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- కొన్నేళ్లుగా పాల ఉత్పత్తి కోసం పెరిగిన ఆవుల పెంపకం
- మాంసాహార ఉత్పత్తుల ఎగుమతులతో భారీ ఆదాయం



సాక్షి ప్రతినిధి, అనంతపురం : అనంతపురం జిల్లా పేరుచెబితే చాలామందికి ఉద్యానపంటలు గుర్తుకు వస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ మొదలుకొని అంజూర్ వరకు అన్నీ ఇక్కడే లభిస్తాయన్న నమ్మకం. ఇక చీనీకి ఆసియా ఖండంలో అతిపెద్ద మార్కెట్ కలిగి ఉన్నది అనంతపురం జిల్లాలోనే అన్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా ఉద్యాన పంటలకే కాదు పశు సంపదకూ ఇప్పుడు పెట్టింది పేరు. రాష్ట్రంలోనే పశు సంపద ఎక్కువగా ఉన్న జిల్లాగా ఉమ్మడి అనంతపురం ముందంజలో ఉంది.

పొట్టేళ్లు, మేకల ఉత్పత్తిలో మేటి..

పొట్టేళ్లు, మేకల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు టాప్‌లో నిలిచాయి. ఇక్కడ ఉత్పత్తి అవుతున్నంతగా వేరే ఏ జిల్లాలోనూ లేవు. ఇక్కడి పశుసంపద వేలాదిమందికి జీవనోపాధి ఇస్తుండగా, మాంసాహార అమ్మకాల్లో లక్షలాదిమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఉమ్మడి అనంతపురం నుంచి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి.

మాంసం ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ..

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మాంసం ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మేకలు, గొర్రెల మాంసం ఎగుమతి అవుతోంది. రోజూ కోట్లాది రూపాయల లావాదేవీలు ఈ మాంసం విక్రయాల ద్వారా జరుగుతున్నాయి. చాలా కుటుంబాలకు పాలు ఆధారం కావడంతో ఇప్పుడు రెండు జిల్లాల్లోనూ ఆవుల పెంపకం ఎక్కువగా ఉంది.

చిట్టడవులే మూలం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువగా మెట్టభూములు ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు పశువులకు బలవర్ధకమైన ఆహారం ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. దీనికితోడు జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లలో చిట్టడవులు వ్యాపించి ఉన్నాయి. 67 రకాల అసాధారణ గడ్డి ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. ఇలాంటి పోషకాలతో కూడిన గడ్డి ఎక్కడా లేదని ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్లు నిర్ధారించారు. ఈ గడ్డి ఇక్కడి పశువుల ఎదుగుదలకు మంచి తోడ్పాటునందిస్తున్నట్టు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో పశుసంపద ఇలా

కేటగిరీ	2019 సంవత్సరంలో	2022లో అంచనా
ఆవులు	2,15,896	277646
గేదెలు	1,89,843	2,15,414
గొర్రెలు	22,97,300	24,78,991
మేకలు	4,12,094	5,00,612
పందులు	8,164	9,780
కోళ్లు	10,36,657	12,71,663

శ్రీసత్యసాయి జిల్లాలో పశు సంపద ఇలా

కేటగిరీ	2019 సంవత్సరం	2022లో అంచనా
ఆవులు	2,81,206	347231
గేదెలు	96,500	1,21,907
గొర్రెలు	26,29,287	27,49,823
మేకలు	4,72,092	5,16,232
పందులు	4,603	5,213
కోళ్లు	14,86,918	15,12,784

ఏటా రూ.6 లక్షలకు పైగా ఆదాయం



గత 30 ఏళ్లకు పైగా గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాం. ఇదే మాకు ప్రధానమైన కుల వృత్తి. ప్రస్తుతం 300కు పైగా గొర్రెలున్నాయి. ఏటా రెండుసార్లు పొట్టేళ్లను విక్రయించడం ద్వారా దాదాపు రూ.6లక్షలకు పైగా ఆదాయం వస్తోంది.

– ఉజ్జినప్ప, గొర్రెల కాపరి, బొమ్మేపర్తి, రాప్తాడు మండలం

ప్రతిఫలంతోపాటు కష్టమూ ఎక్కువే



గొర్రెల పెంపకంలో ప్రతిఫలంతోపాటుగానే కష్టం సైతం అధికంగా ఉంటుంది. గొర్రెల మేపు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడంతోపాటు గాలి, వానలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మాకు 700కు పైగా గొర్రెలు ఉన్నాయి. వీటితో ఏడాదికి రూ.15 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది.

– బ్యాళ్ల రవి, కొడిమి, అనంతపురం రూరల్ మండలం

అనుకూలమైన ప్రాంతం కావడం వల్లే..



గొర్రెలు, మేకలు ఇతర ఏ పశువులకైనా ఉమ్మడి అనంతపురం జిల్లా అనుకూలమైన ప్రాంతం. పాడి నేలలు, చిట్టడవులు ఎక్కువగా ఉండటం పశువుల పోషణకు సానుకూలం. దీనికితోడు జిల్లాలో బీసీలు ఎక్కువగా ఉండటంలో వృత్తి రీత్యా కూడా మేకలు, గొర్రెలు పెంపకం ఎక్కువగా ఉంది. మంచి ఆదాయ వనరుగా కూడా జీవాల పెంపకం ఉంది.

–డా. సుబ్రమణ్యం, సంయుక్త సంచాలకులు, పశు సంవర్ధకశాఖ

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షాలు



అనంతపురంలో కురుస్తున్న వర్షం


అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు మండలాల పరిధిలో 3.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.యాడికి, ఆత్మకూరు, అనంతపురం, రాప్తాడు, శింగనమల, కూడేరు, కణేకల్లు, గుత్తి మండలాల్లో 10 మి.మీ పైగా వర్షం కురిసింది. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, కంబదూరు, పెద్దపప్పూరు, పామిడి, పెద్దవడుగూరు, విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. మే నెల సాధారణ వర్షపాతం 36.7 మి.మీ కాగా ఇప్పటికే 55.6 మి.మీ నమోదైంది. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారిన నేపథ్యంలో రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ సోమవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో పేర్కొన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీనారసింహుడు



ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం లక్ష్మీనారసింహుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవకు ముందుగా ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో నృసింహుని కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

2 నుంచి 'పది' సప్లిమెంటరీ



రాప్తాడురూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల షెడ్యూలును ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. జూన్ 10 వరకు పరీక్షలు జరుగుతాయని డీఈఓ సాయిరామ్ తెలిపారు. రోజూ ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 17 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 18 నుంచి 22 వరకు రూ.50 అదనపు రుసుంతో చెల్లించవచ్చన్నారు. రీకౌంటింగు సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానాలో ఈ నెల 13 లోపు చెల్లించి దరఖాస్తులను అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో అందజేయాలన్నారు. ఒక విద్యార్థి అన్ని సబ్జెక్టులకూ కలిపి ఒకే చలానా తీయొచ్చన్నారు.

రేపు పెన్షన్ అదాలత్



అనంతపురం సిటీ: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కడప రీజియన్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్(పెన్షన్) ప్రేమలత తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈపీఎస్–1995 నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ఫిర్యాదులను పరిష్కరించడానికి వీలుగా ఆ రోజు ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా అదాలత్ నిర్వహించనున్నట్లు వివరించారు. పెన్షనర్లు, రానున్న మూడు నెలల్లో పెన్షనర్లు కానున్న ఈపీఎస్ సభ్యులు పెన్షన్ అదాలత్‌లో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన లింక్ ఇలా..

https://meetingsapac.19.webex.com/meetingsapac19/j.php?MTID=meed056a25cce0527b548679d479e180

మీటింగ్ నంబర్: 2643 344 0966,

పాస్‌వర్డ్ : 1234

మల్బరీ సాగు లాభదాయకం



నుసికొట్టాలలో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీధర్

కళ్యాణదుర్గం: మల్బరీ సాగుతో మంచి ఆదాయం లభిస్తుందని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. సోమవారం చిత్తూరు హార్టికల్చర్ ప్లానింగ్ జేడీ ధర్మజ, అనంతపురం ఆత్మ పీడీ మద్దిలేటి, అనంతపురం సెరికల్చర్ అధికారి ఆంజనేయులుతో కలిసి కమిషనర్ కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల, మల్లాపురం గ్రామాల్లో సాగు చేసిన మల్బరీ పంటలను పరిశీలించారు. నుసికొట్టాల రైతులు అనందరెడ్డి, జయచంద్రారెడ్డి మల్బరీ సాగులో అవలంబిస్తున్న ఆధునిక విధానాలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మల్లాపురం రైతు పరశురామప్ప పశువుల ఎరువులతో సాగు చేసిన పంటను పరిశీలించారు. మల్బరీ సాగు.. పట్టుగూళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని, రైతులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీలు ఉషావర్ధిని, నవీన్, ఎస్ఓ బాబయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంబదూరు: ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్ సోమవారం కంబదూరులోని భీములకుంట రోడ్డు సమీపాన నిర్మిస్తున్న ఉద్యాన శాఖ కలెక్షన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కేజీబీవీ వెనుక ఉన్న వక్క ప్లేట్ల కేంద్రాన్ని పరిశీలించి.. తయారీ విధానంపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ యల్లప్ప, ఏఓ జాఫర్, హార్టికల్చర్ అధికారి గౌసియా తదితరులు పాల్గొన్నారు.

కమనీయం .. శ్రీవారి కల్యాణోత్సవం





శ్రీవారితో కల్యాణానికి బాలికను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం, కల్యాణోత్సవంలో పాల్గొన్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

- విశిష్ట సంప్రదాయం ప్రకారం బాలికతో వివాహం

రాయదుర్గం: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. విశిష్ట సంప్రదాయం ప్రకారం బాలికతో శ్రీవారికి కల్యాణం జరిపించారు. పట్టణంలోని కోట ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం కల్యాణోత్సవం చేశారు. పద్మశాలీయ వంశం అరవ తెగకు చెందిన పన్నెండేళ్ల బాలికతో శ్రీనివాసుడి కల్యాణం జరిపితే.. ఆ బాలికకు సకల గుణ సంపన్నుడు భర్తగా వస్తాడని భక్తుల నమ్మకం. ఈ ఏడాది అరవ స్వప్న, జనార్ధన దంపతుల మూడో సంతానమైన వైశాలిని వధువుగా నిర్ణయించారు. అరవ తెగ కులదైవం భక్త మార్కండేయుని ఆలయం వద్దకు వేంకటేశ్వరుడు చేరుకున్నాక, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వధువు ఇంటికెళ్లి సంప్రదాయబద్ధంగా తీసుకొచ్చారు. తాంబులాలు మార్చుకుని వేంకటేశ్వరుడితో కలిసి బాలికను పెళ్లి మంటపం వరకు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ భారీ ఊరేగింపుతో చేర్చారు. అభిజిత్ లగ్నంలో సరియగు ముహూర్తానికి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుడితో బాలిక మెడలో తల్లి చేత పసుపుతాడు కట్టించగా కల్యాణ ఘట్టం ముగిసింది. ఈ వేడుకలను తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వధూ వరుల తరపు ఎవరెవరంటే...


శ్రీవారి కళ్యాణోత్సవ వేడుకలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు, వారి కుమార్తె ప్రవంతిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. పెళ్లి కుమారుడైన వేంకటేశ్వరుడి తరపున విప్ కాపు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, పెళ్లి కుమార్తె తరపున కాపు భారతి, ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, కూన నాగప్ప, శివప్ప, పొరాళ్ల శివ ఉండి కార్యక్రమాలు చేపట్టారు. వీరితో కలిసి వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈఓ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఆలయ కమిటీ సభ్యులు అక్షింతలు వేశారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి స్వగృహంలో కేకేటీ వెంకటేశులు, బీఎస్‌టీ తిప్పేస్వామి సహకారంలో 4వేల లడ్డూలను తయారు చేయించి పంచి పెట్టారు.

రేపు బ్రహ్మరథోత్సవం

ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం 11 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు.

పాలన ఇక సులువు

- అనంతపురం మండలం రెండుగా విభజన
- అర్బన్ మండలం, రూరల్ మండలం ఏర్పాటు
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



రెండు మండలాల మ్యాప్

అనంతపురం అర్బన్: పాలనా సౌలభ్యం కోసం అనంతపురం మండలం రెండుగా విభజన అయ్యింది. అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన జీఓ 206ని సోమవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు అనంతపురం మండలం నగరంతో కలిసి ఉంది. అర్బన్ పరిధిలో ఐదు లక్షల జనాభా, రెండు లక్షల జనాభా రూరల్ పరిధిలో ఉంది. జనాభా ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతున్న విషయాన్ని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురాన్ని రెండు మండలాలుగా విభజించాలని విన్నవించారు. సీఎం సానుకూల నిర్ణయంతో అర్బన్, రూరల్ మండలాలుగా ఏర్పడ్డాయి. ప్రజల దశాబ్దాల కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌కు ఎమ్మెల్యే అనంత ధన్యవాదాలు తెలిపారు. అర్బన్, రూరల్ మండలాలకు ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయాల ఏర్పాటుతో పాలన సులువు కానుందన్నారు.

- అనంతపురం అర్బన్ మండల పరిధిలోకి నగర పాలక సంస్థ (74 వార్డు సచివాలయాలతో కూడిన 28 రెవెన్యూ వార్డులు), ఎ.నారాయణపురం, అనంతపురం గ్రామం, కక్కలపల్లిలో భాగమైన రుద్రంపేట పంచాయతీ, పాపంపేట కొంత భాగం వస్తాయి.
- అనంతపురం రూరల్ మండల పరిధిలోకి కొడిమి, తాటిచర్ల, సోములదొడ్డి, రాచానపల్లి, సజ్జలకాలవ, కురుగుంట, గొల్లపల్లి, కామారుపల్లి, ఆలమూరు, కాటిగానికాలవ, కక్కలపల్లి, పాపంపేట కొంత భాగం, ఉప్పరపల్లి, ఇటికలపల్లి, జంగాలపల్లి, కందుకూరు, చియ్యేడు, మన్నీల, కక్కలపల్లి గ్రామం, కక్కలపల్లి కాలనీ వస్తాయి.

నేడు 'జగనన్నకు చెబుదాం' ప్రారంభం

అనంతపురం అర్బన్: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని కలెక్టర్ గౌతమి తెలిపారు. కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని మండల, మునిసిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభమయ్యే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి జిల్లా కేంద్రంలో కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. మండల కేంద్రాల్లో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఎంపీడీఓ లేదా తహసీల్దారు కార్యాలయాల్లో, కమిషనర్లు మునిసిపల్ కార్యాలయాల్లో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోనూ అక్కడి సిబ్బంది పాల్గొనాలని చెప్పారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24ను కలెక్టర్ ఆవిష్కరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న లబ్ధిని క్యాలెండర్‌లో పొందపరిచారన్నారు. క్యాలెండర్‌ను ప్రతి జిల్లా కార్యాలయానికీ అందజేయాలని డీపీఆర్ఓను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, డీపీఆర్ఓ పి.గురుస్వామి శెట్టి, జెడ్పీసీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

ప్రత్యేక శ్రద్ధతో అర్జీలు పరిష్కరించాలి

'స్పందన' అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కేశవనాయుడు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 373 అర్జీలు స్వీకరించారు.

కొన్ని వినతులు ఇలా...

ప్రమాదంలో రెండు పాదాలు కోల్పోయి.. కదలలేని స్థితిలో ఉన్న తనకు ప్రస్తుతం వస్తున్న రూ.3వేల పింఛన్‌ను పెంచాలని గుంతకల్లు మండలం వైటీచెరువు గ్రామానికి చెందిన ఖుర్షిద్‌బీ అర్జీ అందజేసింది. కలెక్టర్ సానుకూలంగా స్పందించి 'బెడ్ రీడ్' కింద రూ.5వేల పింఛన్‌ను వర్తింపజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

- పత్తి పంట నష్టపోయిన తనకు 2020–21కు సంబంధించి వాతావరణ బీమా అందలేదని తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు వేణుగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.
- ఆర్డీఓ ఆదేశించినా భూమిని వీఆర్వో సర్వే చేయించడం లేదని డి.హీరేహాళ్ మండలం నాగలాపురానికి చెందిన వన్నూరుస్వామి ఫిర్యాదు చేశాడు. నాగలాపురం పొలం సర్వే నంబర్ 102–బీ2లో 2.50 ఎకరాలను తాము సాగు చేసుకుంటున్నామని, సర్వే చేయించి హద్దులు చూపేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

రాష్ట్ర సుభిక్షం కోసమే 'శ్రీలక్ష్మీ మహాయజ్ఞం'



అనంతపురం కల్చరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండేదుకు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో 'శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. విజయవాడ వేదికగా ఈ నెల 12 నుంచి 17 వరకు సాగే అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞం ఆహ్వాన పత్రికలను సోమవారం రెవెన్యూ భవన్‌లో కలెక్టర్‌తో పాటు దేవదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, డీఆర్వో గాయత్రి, ఆర్డీఓ మధుసూదన్, ఇతర శాఖల అధికారులు ఆవిష్కరించారు. ఆరు రోజుల పాటు సాగే మహాయజ్ఞం వివరాలను అధికారులు తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఆరురోజుల పాటు ఎండోమెంట్ శాఖ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాయజ్ఞ యాగాదులను పండితుల సమక్షంలో నిర్వహిస్తోందన్నారు. ప్రతిరోజు ఉదయం హోమాలు, సాయంత్రం రోజుకొక దేవతామూర్తుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపిస్తారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ దీక్షాధారణ చేయడానికి అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞానికి విచ్చేస్తారని తెలిపారు.

ఉచిత విద్య దరఖాస్తు గడువు పొడిగింపు

రాప్తాడురూరల్: విద్యాహక్కు చట్టం–2009, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)సి అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశానికి రెండోవిడత దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించారు. ఈ మేరకు డీఈఓ సాయిరామ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎస్ఈ పోర్టల్‌లో ఈ నెల 15 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను 16 నుంచి 20 వరకు సచివాలయాల్లో పరిశీలించి విద్యార్థుల అర్హతపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. 22న లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారని, 24 నుంచి 28 వరకు విద్యార్థులు ప్రవేశం పొందవచ్చని డీఈఓ వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి


పాలిసెట్ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ జయచంద్రారెడ్డి

అనంతపురం: ఈ నెల 10న ఏపీ పాలిసెట్-2023ను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ హోదాలో అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి ఆదేశించారు. పాలిసెట్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం ఉదయం పాలిటెక్నిక్ కళాశాలలో ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 9,806 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం నగరంలో 13 పరీక్ష కేంద్రాల్లో 5,840 మంది, కళ్యాణదుర్గంలోని 5 పరీక్ష కేంద్రాల్లో 1,551 మంది, తాడిపత్రిలోని 8 పరీక్ష కేంద్రాల్లో 1,695 మంది హాజరు కానున్నట్లు వివరించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

హిందూపురం: రైలు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. హిందూపురం రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని దేవరపల్లి స్టేషన్ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడికి 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని రైల్వే హెచ్‌సీ ఎర్రిస్వామి తెలిపారు. ముఖానికి బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. 5.5 ఎత్తు, నలుపు రంగు, నలుపు తెలుపు కలగలసిన తల వెంట్రుకలు, జీన్స్ వైట్‌కలర్ ఫుల్ షర్టు, నలుపు రంగు నైట్‌ప్యాంటుతో పాటు మెడలో పసుపు దారములున్నాయన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 94412 38182, 94406 27641కు సమాచారం ఇవ్వాలని కోరారు.

డీల్ కుదిరితే ఓకే

- ఐసీడీఎస్‌లో ఏకపక్ష ఛైఖరి
- అంగన్‌వాడీ సిబ్బంది కొనసాగింపు, తొలగింపులో ఇష్టారాజ్యం
- ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైతే ఓకే
- లేదంటే డబ్బుతో అన్ని సర్దుకుపోతాయి
- ఉన్నతాధికారి తీరుపై సర్వత్రా విమర్శలు



అనంతపురం సెంట్రల్: స్త్రీశిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఏకీకృత శిశు అభివృద్ధి సేవల (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ – ఐసీడీఎస్) పథకం నిర్వహణ జిల్లాలో లోపభూయిష్టంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఐసీడీఎస్‌లోని ఓ ఉన్నతాధికారి సామాజిక వర్గానికి చెందిన వారికి ఓ న్యాయం... లేకపోతే నగదు విషయంగా డీల్ కుదిరితే అన్ని సర్దుకుపోతాయనే వదంతులు వ్యాపించడంతో సొంత శాఖలోని ఉద్యోగులే విస్తుపోతున్నారు.

దాడికి తెగబడినా చర్యలు శూన్యం

అనంతపురంలోని అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కార్యకర్తపై ఏడాదిగా అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. గత ఆరునెలలుగా ఎలాంటి సమాచారం లేకుండా ఆమె సెలవుపై వెళ్లారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన ఓ లబ్ధిదారురాలిపై దాడికి పాల్పడ్డారు. రెండురోజుల క్రితం ఏకంగా సూపర్‌వైజర్‌పై దాడి చేశారు. డివిజన్ పర్యటనకు వెళ్లిన ముఖ్య ప్రజాప్రతినిధితో కూడా దురుసుగా వ్యవహరించారు. ఈమె ఉద్యోగానికి అనర్హురాలని అధికారులకు స్థానిక సీడీపీఓ ఇచ్చిన నివేదిక... కలెక్టర్ వద్దకు చేరేసరికి మొత్తం తారుమారైంది! సదరు కార్యకర్త ఐసీడీఎస్‌లోని ఓ ఉన్నతాధికారి సామాజిక వర్గానికి చెందిన వారు కావడమే కాక.. నగదు విషయంగా కుదిరిన ఒప్పందమే ఇందుకు కారణమని ఆ శాఖ ఉద్యోగులు బాహాటంగానే చర్చిస్తున్నారు.

తొలగించాలంటూ ఒత్తిళ్లు

ఓ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మారుమూల మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపు అంశం ఐసీడీఎస్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఆ కార్యకర్తను తొలగించాలని సంబంధిత మండల స్థాయి అధికారులపై ఐసీడీఎస్‌లోని ఓ ఉన్నతాధికారి ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే కార్యకర్త తొలగింపు అంశంలో నిబంధనలు ఉల్లంఘిస్తే భవిష్యత్తులో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండల స్థాయి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మారుమూల మండలంలో పనిచేస్తున్న ఓ అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించాల్సిన అవసరమేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అంతా వివాదాస్పదమే

ఐసీడీఎస్‌లో ఉన్నతాధికారి తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయనే వాదనలున్నాయి. డీల్ కుదిరితే ఒకలా... కుదరకపోతే మరోలా నిర్ణయాలు తీసుకుంటారనే ఆరోపణలున్నాయి. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత అంగన్‌వాడీ సిబ్బంది తొలగింపు వ్యవహారాలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. శిశుగృహాల్లో చిన్నారుల దత్తత విషయంలోనూ అవినీతికి తావిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తనకు శిశువును దత్తత ఇచ్చే అంశంలో బంగారు చైన్ డిమాండ్ చేశారంటూ గతంలో ఓ వివాహిత నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆమెపై తొలుత చర్యలు తీసుకున్నట్లు ఇతర సెక్షన్‌కు బదిలీ చేసినా.. కొద్ది రోజుల తర్వాత తిరిగి యథాస్థానంలో నియమించారు. ఈ అంశంలోనూ భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఐసీడీఎస్ ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన తాయన్న

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి ఉత్తర్వుల మేరకు అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న.. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేస్తున్న మహబూబ్ అలీని డిప్యూటేషన్‌పై రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లుకు అక్కడ పనిచేస్తున్న తాయన్నను అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

డీఎడ్ ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌కు అవకాశం

పుట్టపర్తి: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి డీఎడ్ ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. త్వరలో డీఎడ్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనున్న నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ లోపు ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌ను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'పోలీసు స్పందన'కు 123 వినతులు


ఫిర్యాదుదారు సమస్యపై సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 123 వినతులు అందాయి. అర్జీదారులతో ఎస్పీ కె.శ్రీనివాసరావు మమేకమై సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ... సమస్యలకు 14 రోజుల్లోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన అర్జీల పరిష్కారాన్ని భారంగా కాకుండా బాధ్యతగా పరిగణించాలని హితవు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు

రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

- కలెక్టర్ గౌతమి


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి

అనంతపురం క్రైం: ఆపద సమయంలో వ్యక్తుల ప్రాణాలు కాపాడుతున్న రెడ్‌క్రాస్ సేవలు అమోఘమని కలెక్టర్ గౌతమి అన్నారు. అనంతపురంలోని సీడీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్నీడూనంట్ చిత్రపటానికి ఆ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్‌తో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 19వ శతాబ్దంలో రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటు తీరును వివరించారు. రక్తదానంతో ఎందరో ప్రాణాలు కాపాడినందుకు గాను హెన్నీడూనంట్‌కు మూడుసార్లు నోబుల్ పురస్కారం దక్కడం సమంజసమేనని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తిని ప్రపంచ దేశాలు అందిపుచ్చుకుని రెడ్‌క్రాస్ సేవలను విస్తారం చేయడం అభినందనీయమన్నారు. 1920లో రెడ్‌క్రాస్ సేవలపై చట్టబద్ధత కల్పిస్తూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మొదలయ్యాయన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విపత్కర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ సంస్థ అందజేసిన సేవలను కొనియాడారు. కాపు భారతి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో బ్లడ్ బ్యాంక్, ఫస్ట్ ఎయిడ్, వ్యాధుల పట్ల అవగాహన, మొక్కల పెంపకం, తదితర సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సంస్థకు రూ.4 లక్షల విరాళాన్ని చెక్ రూపంలో కలెక్టర్ గౌతమికి ఆ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ ప్రసాద్ అందజేశారు. అనంతరం కోవిడ్ సమయంలో విశిష్ట సేవలందించిన వారిని కలెక్టర్ సన్మానించి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలోని 51 మంది పేద విద్యార్థినులకు హైజినిక్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు ఆలంబన జనార్దన, రమేష్, దాతలు మహాలక్ష్మి క్లాత్ హితెన్‌కుమార్‌జైన్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్దన్ రెడ్డి, బి.హరిణి, టీవీవీఎన్ సుబ్రహ్మణ్యం, సుధీర్, బద్రీనాథ్, ఎస్ఆర్ఐటీ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిహార్ వాసి దుర్మరణం

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీహార్‌లోని పాట్నా జిల్లా దుహువు గ్రామానికి చెందిన జితేందర్ (30), ప్రియాంకదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొంత కాలం క్రితం బతుకు తెరువు కోసం కుటుంబ సభ్యులతో కలసి గుంతకల్లుకు వలస వచ్చిన జితేందర్... స్థానిక పారిశ్రామిక వాడ సమీపంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. పారిశ్రామిక వాడలోని ఓ ఫ్యాక్టరీలో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు హోటల్‌కెళ్లి భోజనం తీసుకుని తిరిగి విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో జితేందర్ ఎగిరి రోడ్డుపక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న వాహనదారులు రోడ్డు పక్కన పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

16న హెచ్‌డీఎస్ సమావేశం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈ నెల 16న హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గౌతమి ఆస్పత్రి అధికారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతేడాది ఫిబ్రవరిలో చివరిసారిగా హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది.

రైల్వే సామగ్రి చోరీ కేసులో ఆర్పీఎఫ్ పురోగతి

అనంతపురం సిటీ: రైల్వేకు చెందిన విలువైన ఇనుప సామగ్రి చోరీ అయిన కేసులో ఆర్పీఎఫ్ మరింత పురోగతి సాధించింది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు ఆరుగురు కూలీలను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. చోరీకి గురైన విలువైన ఇనుప కమ్మీలను కొనుగోలు చేసిన అనంతపురం పరిసర ప్రాంతాలకు చెందిన గుజరీ వ్యాపారులు ఎవరనేది గుర్తించారు. ఈ వ్యవహారంలో కొందరు వ్యాపారులను ఆర్పీఎఫ్ ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రేపోమాపో నిందితులు మీడియా ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిసింది. కాగా, రైల్వే శాఖకు చెందిన సామగ్రిని మూడు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా తరలించి, గుజరీకి అమ్మి జల్సా చేసిన రైల్వే ఉద్యోగితో పాటు కూలీలను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్పీఎఫ్‌కు చెందిన ప్రత్యేక బృందానికి అవార్డులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ఆరుగురిపై కేసు నమోదు

యాడికి: కర్రలతో పరస్పరం దాడులుచేసుకున్న ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం యాడికి మండలం నిట్టూరులో వెంకటేష్‌కు చెందిన గొర్రెల పెంటపై అదే గ్రామానికి చెందిన శివనారాయణ, రామాంజి, నాగేషు, మరో వ్యక్తి లారీతో తొక్కించారు. దీంతో పెంట మొత్తం చెల్లాచెదురు కావడంతో తన కుమారుడితో కలసి వెంకటేష్ నిలదీశాడు. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని కట్టెలతో పరస్పరం దాడి చేసుకున్నారు. వెంకటేసు, నాగేషుకు గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బోధనపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: కీలకమైన పదో తరగతి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చాలా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లను జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ హెచ్చరించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలపై జిల్లాలోని మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో సోమవారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆయన సమీక్షించారు. మోడల్ స్కూల్ వారీగా వచ్చిన ఫలితాలపై ఆరా తీశారు. జిల్లాలో ఉన్న 15 మోడల్ స్కూళ్లలో యల్లనూరు స్కూల్‌లో 74 మంది విద్యార్థులకు గాను కేవలం 30 మంది ఉత్తీర్ణత కావడంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్జెక్టు టీచర్లు ఉన్నప్పటికీ ఉత్తీర్ణత శాతం ఎలా తగ్గిందని నిలదీశారు. ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సప్లిమెంటరీ పరీక్షలకు సమయం ఉందని, ఈ లోపు విద్యార్థులందరూ పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంగా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ప్రిన్సిపాళ్లు, టీచర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మరొకరి మృతి


అరుణ్‌కుమార్ (ఫైల్)

బెళుగుప్ప: బొలెరోను ఐచర్ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరుకుంది. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి వద్ద ఆదివారం రాత్రి జాతీయ రహదారి పక్కనే ఆపిన బొలెరోను ఐచర్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఘటనలో ఏడుగురు గాయపడగా.. ఆదివారం రాత్రి కాలువపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీ నాగభూషణ మృతిచెందాడు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం వేపులపర్తి గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (40) మృత్యువాత పడ్డాడు. గాయపడిన వారిలో ఆదినారాయణ, శేఖర్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ రామకృష్ణయ్య పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దవడుగూరు: కుటుంబకలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలిని పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన మాల వెంకటలక్ష్మి (30)గా పోలీసులు గుర్తించారు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై రైల్వే ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బెంగళూరులో వలస కూలీ దుర్మరణం


మృతుడు వీరేష్

గుమ్మఘట్ట: పొట్టకూటి కోసం బెంగళూరుకు వెళ్లిన ఓ కూలీ... విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన మారన్న, జయమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడు వీరేష్ (19) రెండు నెలల క్రితం బెంగళూరుకు వెళ్లి అక్క, బావతో కలసి బేల్దారి పనుల్లో పాల్గొంటున్నాడు. సోమవారం పని ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూజీసీ-నెట్, యూజీసీ-సీఎస్ఐఆర్, నెట్, గేట్‌లో అర్హత సాధించిన వారు అర్హులు. ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి. పూర్తి వివరాలకు www.skuniversity.ac.inలో వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

హిందూపురం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఓ యువతి ఆశ్రయించింది. హిందూపురం వన్‌టౌన్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు... హిందూపురంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన ఇర్ఫాన్‌కు ముంబయిలోని ముస్కాన్ సమీప బంధువు. ఎనిమిదేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో గత నెల వీరిద్దరికీ పెళ్లి చేయాలని నిశ్చయించుకుని వధువు తల్లిదండ్రులు ఇర్ఫాన్ కుటుంబసభ్యులకు విమాన టికెట్లు సైతం పంపారు. అయితే ఇర్ఫాన్ తన కుటుంబసభ్యుల మాట విని పెళ్లికి హాజరు కాలేదు. దీంతో ఆదివారం హిందూపురానికి ముస్కాన్, కుటుంబసభ్యులు చేరుకుని స్థానిక ఫిర్దోస్ మసీదులో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఆ సమయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చెలరేగి గొడవపడ్డారు. పరస్పర దాడి చేసుకున్నారు. ఘటనపై ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించి పోలీసులు విచారణ చేశారు. ఆ సమయంలో తనను పెళ్లి పేరుతో ఇర్ఫాన్ మోసం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పిడుగు పాటు... పాడిఆవు మృతి


మృతి చెందిన ఆవును చూపుతున్న పాడిరైతు రమణారెడ్డి

యాడికి: పిడుగు పాటుకు గురై ఓ పాడి ఆవు మృతి చెందింది. యాడికి మండలం లక్షుంపల్లిలో సోమవారం వేకువ జాము 1.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో గ్రామానికి చెందిన రైతు పోస్టల్ రమణారెడ్డి పశువుల పాకపై పిడుగు రాలింది. ఘటనతో పాకలోని ఆవు మృతి చెందింది. దీంతో రూ.60 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

పీఏబీఆర్ కుడికాలువ గేట్ల మూసివేత

కూడేరు: పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు నిలిపి వేశారు. ఈ మేరకు రిజర్వాయర్ జేఈ లక్ష్మీదేవి సోమవారం తెలిపారు. కుడి కాలువకు కొన్ని నెలల పాటు నీటిని సరఫరా చేయడంతో 10వ కిలోమీటర్ వద్ద కాలువకు ఇరువైపులా నీరు ఊరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నట్లు కొందరు రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన అధికారులు నీటి సరఫరాని నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలల పాటు మొత్తం 6 టీఎంసీల నీటిని కుడికాలువకు విడుదల చేశారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

గుత్తి: స్థానిక కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుడు బనోత్ బాపూజీపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాలయంలో ఉపాధ్యాయురాలిని అకారణంగా దూషించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం బనోత్ బాపూజీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

కుందుర్పి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృత చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన నాగభూషణప్ప (69)కు భార్య ముద్దక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లిన నాగభూషణప్ప ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. విషయాన్ని గుర్తించిన పశువుల కాపర్ల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: నగరంలోని ఆరో డివిజన్‌లోని నీరుగంటి వీధిలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేణుగోపాల్‌నగర్ త్రివేణి థియేటర్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నారాయణమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలో నారాయణమ్మ (60) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం పంపనూరుకు చేరుకొని నారాయణమ్మ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నారాయణమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సకల సమస్యల పరిష్కార మార్గం



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న హిందూ ప్రచార వేదిక సభ్యులు

అనంతపురం కల్చరల్: సకల సమస్యలకు పరిష్కార మార్గమైన భగవద్గీత ఇంటింటా పఠించాలని హిందూ ధర్మ వేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం కల్యాణదుర్గం రోడ్డు, పాపంపేట పరిసర ప్రాంతాల్లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల భగద్గీత ధర్మ ప్రచారం నిర్వహించారు.

ఇద్దరు పిల్లలు అదృశ్యం



రాంచరణ్




పి.కిర్పియ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు పిల్లలు అదృశ్యమయ్యారు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థిని పి.కిర్పియ ఇంటి సమీపంలోని ట్యూషన్‌కు వెళ్తానని సోమవారం సాయంత్రం 5 గంటలకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.

వెంకన్న దర్శనానికి వెళ్లొస్తానని..

స్థానిక త్రీటౌన్ పరిధిలోని 2వ రోడ్డుకు చెందిన సతీష్, శ్రీదేవి దంపతుల కుమారుడు రాంచరణ్ వెంకన్న దర్శనానికి వెళ్లి వస్తానని ఆదివారం అదృశ్యమయ్యాడు. సాయంత్రం 4 గంటల సమయంలో తిరుపతికి వెళ్లి దేవుడిని దర్శించుకొని వస్తానని తన చెల్లెలు అక్షయతో చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని బాలిక ఆలస్యంగా తల్లిదండ్రులకు చెప్పడంతో రాంచరణ్ ఆచూకీ తెలుసుకోవడం కష్టతరమైంది. బాధిత కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ వలిబాషా, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సెల్: 9346917115 లో సమాచారం అందించాలని కోరారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి



హాజరైన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం. లిఖిత

అనంతపురం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎం. లిఖిత అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో సొసైటీ సీఈఓలకు వార్షిక వ్యాపార ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కంప్యూటరైజేషన్ ప్రాధాన్యతపై తెలియజేశారు. రుణేతర కార్యక్రమాల విస్తరణతో సంఘాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ ఏబీ రాంప్రసాద్, సుదర్శనరావు, డీపీడీఎం తేజస్విణి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో పల్లెవించిన ప్రతిభ

ఇటీవల పదోతరగతి ఫలితాలు విడుదలయ్యాయి. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అందరూ గ్రామీణ విద్యార్థులే. కష్టపడి, ఇష్టపడి చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించారు. విద్యార్థులు చదువుకోసం 'అమ్మ ఒడి' అందిస్తూ, మధ్యాహ్న సమయంలో పాఠశాలల్లో 'గోరుముద్ద'తోపాటు ప్రతి విద్యార్థికీ.. జగనన్న విద్యాకిట్లు, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి చేస్తుండడంతో గ్రామీణ విద్యార్థులు కూడా ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లకు దీటుగా మార్కులు సాధించారు.

– రాప్తాడు రూరల్/రాప్తాడు :



రాప్తాడు మోడల్ స్కూల్

రాప్తాడు మండలంలో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్ నుంచి మొత్తం 318 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 176 మంది విద్యార్థులు 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి వినయ్‌కుమార్ మండల ప్రథమ స్థానంలో నిలిచాడు. కేజీబీవీ విద్యార్థిని అక్షయ ద్వితీయ స్థానం సాధించింది. ఎం.బండమీదపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని జాహ్నవి మూడో స్థానంలో నిలిచింది.

ఉత్తీర్ణత శాతం ఇలా..

రాప్తాడు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 77 మందికిగాను 60 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ విద్యార్థినులు 36 మందిలో 26 మంది పాసై, 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. హంపాపురం విద్యార్థులు 50 మందిలో 28 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం. బండమీదపల్లి ఉన్నత పాఠశాలలో 20 మందిలో 11 మంది పాసై 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. గాండ్లపర్తి ఉన్నత పాఠశాలలో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఆరుగురు పాసై 43 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో 70 మందిలో 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై, 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. మరూరు విద్యార్థులు 31 మందిలో 10 మంది పాసై 32 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఆత్మకూరు పాఠశాలలవారీగా ఉత్తీర్ణత శాతం ఇలా..

ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 137 మందిలో 68 మంది పాసై 49.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. ముట్టాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 21 మందికిగాను 8 మంది పాసై 38.1 శాతం ఉత్తీర్ణత సాధించారు. తలుపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 33 మందికిగాను 8 మంది పాసై 24.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. బి.యాలేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 19 మందికిగాను 9 మంది పాసై 47.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. సనప జెడ్పీహెచ్‌ఎస్‌లో 78 మందికిగాను 41 మంది పాసై 52.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. తోపుదుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 35 మందికిగాను 11 మంది పాసై 31.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆత్మకూరు కేజీబీవీలో 39 మందికిగాను 20 మంది పాసై 51.3 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మెడిసిన్ చేయడమే లక్ష్యం



మాది రాప్తాడు మండలంలోని క్రిష్టాపురం గ్రామం. మాది నిరుపేద కుటుంబం. మా అమ్మ నాన్నలు బాలజీ, శ్యామల. మా చదువు కోసం అనంతపురానికి వచ్చి టిఫెన్ బండి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అందులో వచ్చే డబ్బుతో నన్ను చదివిస్తున్నారు. మా పంచాయతీలో పదుల సంఖ్యలో వైద్యవిద్య చదువుతున్నారు. నాకు కూడా అదే లక్ష్యం. మా అమ్మ, నాన్నలు కూడా నన్ను డాక్టర్ చేయాలని అనుకుంటున్నారు. వారి కల నేరవేర్చడానికి కష్టపడి చదువుతున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 574 మార్కులు సాధించా.

– వినాయ్‌కుమార్, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి, రాప్తాడు

వైద్యురాలిని అవుతా



మాది అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామం. మా నాన్న జయరాములు, అమ్మ పద్మావతి. మాది నిరుపేద కుటుంబం. మా నాన్న డ్రైవర్‌గా చేస్తున్నాడు. అమ్మ కూలిపనులకు వెళ్తుంది. మేము ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కేజీబీవీలో చదివిస్తున్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించి 546 మార్కులు సాధించా. వైఎస్సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డాక్టర్‌గా కూడా ఎంతో పేరుతెచ్చుకున్నారు. మా తాత 2000లో చంద్రబాబు పాలనలో మోనోక్రోటో పాస్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు రాజశేఖర్ రెడ్డి మా ఇంటికి వచ్చారు. అప్పుడే మా నాన్న అమ్మ నువ్వు కూడా డాక్టర్ అయ్యి పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని వైఎస్సార్ చెప్పారు. ఆయన స్ఫూర్తితో డాక్టర్ అయ్యి పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్నదే నాకోరిక.

– అక్షయ, కేజీబీవీ, విద్యార్థి, రాప్తాడు

ఉపాధ్యాయులు ప్రోత్సహించారు



మాది రాప్తాడు మండలం చిన్మయ నగర్. మా నాన్న రామ్మూర్తి, అమ్మ ఉమాదేవి. మేము ఇద్దరు కుమార్తెలం. మా నాన్న అనంతపురంలో వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తూ మమ్మల్ని చదివిస్తున్నాడు. ఉపాధ్యాయుల పోత్సాహంతో 539 మార్కులు సాధించా. వారి సహకారం లేకుంటే ఇన్ని మార్కులు సాధించేదాన్ని కాదు. భవిష్యత్తులో ఇంకా బాగా చదివి ఇంజినీర్ అవుతా.

– సంయుక్త, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి, రాప్తాడు

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



మాది ఎం.బండమీదపల్లి గ్రామం. మా నాన్న నాగేంద్ర ప్రసాద్ 12 ఏళ్లుగా గ్రామంలో పూజారిగా పని చేస్తున్నారు. తల్లి శశికళ గృహిణి. సంపాదన తక్కువగా ఉన్నా నాతోపాటు చెల్లెల్ని కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. మా చదువుకోసం మా నాన్న పడుతున్న కష్టం చూడలేక కష్టపడి చదివా. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించా. పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఐఐటీలో సీటు సాధించి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎదగాలన్నది నా లక్ష్యం.

– జాహ్నవి, ఎం.బండమీదపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి, రాప్తాడు

ఇంజినీరింగ్ చేస్తా



మాది రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామం. మాది రైతు కుటుంబం. మా నాన్న చంద్రశేఖర్ వ్యవసాయ పనులు, మా అమ్మ శారద వలంటీర్. కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. అరకొరగా వచ్చే సంపాదన కుటుంబ పోషణకే సరిపోదు. కష్టపడి మమ్మల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఉపాధ్యాయుల పోత్సాహంతో 536 మార్కులు సాధించా. భవిష్యత్తులో బాగా చదువకుని ఇంజినీరింగ్ చేయాలని ఉంది.

– ప్రత్యూష, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి, రాప్తాడు

దుమ్మురేపిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

- ఇద్దరు విద్యార్థినులకు 575 మార్కులు



స్వప్న



మహాలక్ష్మీ యాదవ్



స్పందన



ప్రణతి



చందన

రాప్తాడురూరల్: అనంతపురం అర్బన్, రూరల్ మండలంలోని మున్సిపల్, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. కురుగుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ గురుకుల పాఠశాలలో మొత్తం 81 మంది విద్యార్థినులు పరీక్షలు రాశారు. వారిలో 79 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎం.స్వప్న 575 మార్కులు, మహాలక్ష్మీయాదవ్ 575, ఎస్.స్పందన 574 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది అభినందించారు. మన్నీల జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థిని చందన 573 మార్కులు సాధించింది. కురుగుంట కేజీబీవీ విద్యార్థిని గీత 559 మార్కులు, తపోవనం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని జయలక్ష్మి 566, సిండికేట్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి తరుణ్ 530, రుద్రంపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పావని 507, పాపంపేట స్కూల్ విద్యార్థిని రజిత 522, కందుకూరు స్కూల్ విద్యార్థి చాకలి ప్రశాంత్ 531 మార్కులు సాధించారు.

శారదా స్కూల్ విద్యార్థిని ప్రతిభ..

నగరంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని రామస్వామి ప్రణతి 551 మార్కులతో సత్తా చాటింది. నగరంలోని జానకీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఈఅమ్మాయి తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి లక్ష్మీ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ బిడ్డను చదివిస్తోంది. తల్లి ఆశయాలకనుగుణంగా కష్టపడి చదివిన ప్రణతి మంచి శ్రేణితో ఉత్తీర్ణత సాధించింది.

తలసీమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం

- జీజీహెచ్ ఆర్ఎంఓ వైవీరావు, హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని

అనంతపురం క్రైం: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుంటామని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వైవీరావు, చిన్నపిల్లల విభాగం హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ తలసీమియా దినం సందర్భంగా చిన్నపిల్లల వార్డులో 20 మంది తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం చిన్నపిల్లల విభాగంలోని సెమినార్ హాల్‌లో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ తలసీమియాతో బాధపడేవారికి ఒక్కొక్కరికి ప్రతినెలా రూ.10 వేలు, ఖరీదైన మందులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సంకల్ప్ తలసీమియా కేర్ స్వచ్ఛంద సంస్థ ఆస్పత్రులతో అనుసంధానంతో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ భాస్కర్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రత్యూష, ట్యూటర్ డాక్టర్ శ్రీనివాస్, డీఈఐసీ మేనేజర్ రజిత, స్టాఫ్‌నర్సులు పెద్దక్క, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నపిల్లల విభాగం హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని

విజ్ఞాన శిబిరాలతో పఠనాసక్తి

అనంతపురం: మంచి పుస్తకాలు జీవన నేస్తాలు అని, విజ్ఞాన శిబిరంతో పిల్లల్లో పఠనాసక్తి పెరిగి, నైపుణ్యం పెరుగుతుందని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయిన తొడుక్కో పర్వాలేదు.. ఓ మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం పంతులు అన్న మాటలను ఆయన గుర్తు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి మండలంలోని శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు డ్రాయింగ్ ఆటలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పడం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 11 వరకు 35 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, సంస్థ కార్యదర్శి పి.రమ, డిప్యూటీ లైబ్రరీయన వి. సుబ్బరత్నమ్మ, రీసోర్స్ పర్సన్‌గా సూర్యనారాయణ రెడ్డి , యోగా గురు వెంకటేశప్ప, జూటూరు రమేష్, మిద్దె మురళీకృష్ణ, కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

అనంతపురం: మహిళ, బాలల గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రముఖ కవి నబీ రసూల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగాధర్, గ్రంథాలయాధికారి ఏఎం. శ్రీపతి, గ్రంథాలయ సహాయకులు జి.ప్రవల్లిక , అంజలి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ధరలతో పరిహారం చెల్లించాలి

అనంతపురం అర్బన్: రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇళ్లను కోల్పోతున్న బాధితులకు 2023 ధరలతో పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. పాముదాయి నుంచి గుంటూరు వరకు 544 డీ రోడ్డు నిర్మాణంలో భాగంగా తీసుకున్న ఇళ్లకు ఒక యూనిట్‌కు రూ.3.50 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం స్పందనలో ఆర్డీఓ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై భారం మోపుతున్న కేంద్రం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలపై భారం మోపుతోందని మహిళాసమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీప్రసాద్, పద్మావతి ధ్వజమెత్తారు. వంట గ్యాస్ ధర తగ్గించాలని సమాఖ్య ఆధ్వర్యంలో నాయకురాళ్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్యాస్ సిలిండర్లు కాడె కట్టి లాగుతూ నిరసన తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ గౌతమికి నాయకురాళ్లు వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం మాట్లాడారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, నాగరాజు, ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఆవరణలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ గౌతమికి జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిరాజుద్దీన్, లింగమూర్తి, శ్రీనివాసరెడ్డి, పురుషోత్తం, గోపాల్ రెడ్డి, జార్జ్, రవీంద్ర, సతీష్, నాగభూషణం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర విభాగాధిపతిగా శ్రీరాములు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ ఎం. శ్రీరాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల జరిగిన పాలక మండలి సమావేశంలో న్యాయశాస్త్ర విభాగాధిపతి (కోఆర్డినేటర్)గా నియమించారు. పాలకమండలి ఆదేశాల మేరకు న్యాయశాస్త్ర విభాగాధిపతిగా రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ శంకర్‌నాయక్, ప్రొఫెసర్ చిట్టా సురేష్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ ఎంవీ శ్రీనివాస్, డాక్టర్ తిమ్మయ్య తదితరులు పాల్గొని అభినందించారు.



డాక్టర్ ఎం. శ్రీరాములును అభినందిస్తున్న ప్రొఫెసర్లు

ఆర్‌కే నగర్‌లో పర్యటించిన మేయర్

అనంతపురం క్రైం: నగరంలోని 48వ డివిజన్‌లోని ఆర్‌కేనగర్‌లో మేయర్ వసీం సోమవారం పర్యటించారు. వర్షాలు అధికంగా వస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్‌కే నగర్‌లోని ఓపెన్ జిమ్ములో పరికరాలను మరమ్మతు చేయించాలని డీఈ రాంప్రసాద్‌రెడ్డిని ఆదేశించారు. కార్పొరేటర్ శ్రీనివాసులు, నాయకులు ఖాజా, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఏఈ శంకర్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన: హౌసింగ్ బోర్డులో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని, నిత్యం అందుబాటులో ఉండాలని ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాను డిప్యూటీ మేయర్ ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పారిశుద్ధ్య సిబ్బందిని కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. సోమవారం నగరంలోని మారుతీనగర్, రాంనగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో ఏర్పడ్డ బ్లాక్‌లను తీసివేసి, మురుగు సక్రమంగా వెళ్లేలా చూడాలన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లావాసులకు ఎన్టీఆర్ అవార్డుల ప్రదానం

అనంతపురం కల్చరల్: విద్య, సాహిత్య రంగాల్లో విశేష సేవలందిస్తున్న జిల్లావాసులు గొర్తి వెంకటస్వామి, గుత్తా హరిసర్వోత్తమ నాయుడుకు ఎన్టీఆర్ జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. సోమవారం తిరుపతి యూత్ హాస్టల్ సమావేశ మందిరంలో జరిగిన ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, శ్రీ వెంకట పద్మావతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ నందిపాటి చక్రపాణి, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.నారాయణస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా వారిని సన్మానించారు. ఎన్టీఆర్ పేరిట ఇచ్చే జాతీయ అవార్డులను వారు అందుకోవడంపై శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, అనంత జిల్లా రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాకే శ్రీహరిమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

భ్రూణహత్యలు నేరం

ఆత్మకూరు: ఎవరైనా లింగ వివక్ష చూపి, అబార్షన్‌లు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సర్పంచ్ వరలక్ష్మి, మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు సచివాలయంలో లింగ నిర్ధారణ పరీక్షలు- చట్టంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టం 1996లో అమలులోకి వచ్చిందన్నారు. లింగ నిర్ధారణ చేయించిన వారికి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ఓ చంద్రావతి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టండి

ఆత్మకూరు: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని పోలీసు సిబ్బందికి అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక నిఘా ఉంచి, రోడ్డు నిబంధనలు తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి వేడుకలు

అనంతపురం కల్చరల్: విఘ్నాలు తొలగించే వినాయకుడికి ప్రీతిపాత్రమైన సంకష్టహర చతుర్థి వేడుకలు పలు ఆలయాల్లో సోమవారం పెద్ద ఎత్తున జరిగాయి. స్వామివారికి రుద్రాభిషేకాలు, అర్చనలు, విశేష పుష్పాలంకరణ చేశారు. సోమనాథనగర్‌లో వెలసిన సంకష్టహర వినాయక ఆలయంలో ప్రధాన అర్చకుడు దేవరకొండ వెంకట రమేష్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి వ్రత విధానం జరిగింది. మూడోరోడ్డు బాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి వేడుకలు జరిగాయి.

ఆర్టీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు: ఇంటర్‌లో ప్రవేశాలకు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్డీటీ సెట్‌కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ మల్లికార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్‌కు 500 మార్కులు, సీబీఎస్ఈకి 420 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్డీటీ స్పాన్సర్ షిప్ కలిగిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదివినా అర్హులేనన్నారు. ఈ నెల 9 నుంచి స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలంలోని విద్యార్థులు మాత్రమే రాప్తాడులో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలి

రాప్తాడురూరల్: జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేయకుండా అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ కుళ్లాయి స్వామి, జి.చిరంజీవి విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, నాయకులు వంశీ, మంజు, సమీర్, మను, రారాజు పాల్గొన్నారు.